అమృత సమానం.. దేశీయం

- దేశీయ విత్తన వినియోగం పెరిగేలా గ్రీన్ క్లైమేట్ సంస్థ కృషి
- గిరిజన ప్రాంతాలు, లంక గ్రామాలు, తూర్పు కనుమల్లో విత్తనాల సేకరణ.. వినియోగం
- మిద్దె తోటల పెంపకంపై మహిళలు, విద్యార్థులకు అవగాహన



దేశీయ విత్తనాలను ఆసక్తిగా తిలకిస్తున్న మహిళలు

సీతంపేట: దేశీయ విత్తన వినియోగం పెరిగేలా గ్రీన్ క్లైమేట్ సంస్థ గత 25 ఏళ్లుగా కృషి చేస్తోంది. దీనిలో భాగంగా గిరిజన ప్రాంతాలు, లంక గ్రామాలు, తూర్పు కనుమల్లో ఇప్పటికీ వినియోగిస్తున్న దేశీయ విత్తనాలను ఏటా సేకరించి వాటిని ప్రదర్శనలో ఉంచుతున్నారు. వర్షాకాలం ప్రారంభానికి ముందు జూన్‌లో దేశీయ విత్తనాలకు ఉచితంగా పంచిపెట్టి, మిద్దెతోటలు పెంచేలా మహిళలు, ఎస్‌హెచ్‌జీ గ్రూపులను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం వనమాలి రూఫ్ గార్డెనర్స్ గ్రూప్‌తో కలిసి మిద్దె తోటల పెంపకంపై అవగాహన కల్పించి ఆరోగ్యవంతమైన దేశీయ విత్తనాలతో పండించిన ఆర్గానిక్ కూరగాయలు ఆహారంగా తీసుకునేలా గ్రీన్ క్లైమేట్ సంస్థ కృషి చేస్తోంది. దీనిలో భాగంగా శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 130 రకాల దేశీయ కూరగాయల విత్తనాలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. వరి కంకులతో గుత్తులు, తోరణాలు తయారు చేయడంపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. పలువురు ఔత్సాహిక మహిళలు, విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలో ఉంచిన దేశీయ విత్తనాల ప్రాముఖ్యత తెలుసుకున్నారు. కార్యక్రమంలో బయోడైవర్సిటీ బోర్డు రీజినల్ ఎగ్జిక్యూటివ్ జానకీరావు, జీవీఎంసీ ఎస్ఆర్‌యూ ప్రతినిధులు దివ్య, ప్రమీల, మంగరాజు, ఏవీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అర్చన, ఎస్ఎఫ్ఎస్ అధ్యాపకురాలు శివలక్ష్మి, వనమాలి గార్డెనింగ్ గ్రూప్ ఆర్గనైజర్ మళ్ల సరిత, ఆత్మాంబిక, రేఖ, ఉష, మినీయేచర్స్ ఇన్‌చార్జి రమాదేవి, గ్రీన్ వలంటీర్లు జె.రాజేశ్వరి, ఐ.కృష్ణకుమారి పాల్గొన్నారు.



ప్రదర్శనలో ఉంచిన దేశీయ విత్తనాలు

ప్రదర్శనలో ఉంచిన విత్తనాలు

కొయ్య తోటకూర, స్తంభం తోటకూర, పెరుగు తోటకూర, ఎర్ర తోటకూర, చిలక తోటకూర, ఆరు రకాల వంకాయ విత్తనాలు, చిత్రాడ బీర, నేతి బీర తెలుపు, ఆకుపచ్చ, గుత్తి బీర, లింగరాజు పొట్ల, పాడుగు పొట్ల, పొట్టి పొట్ల, చిత్రాడ బెండ, ఎర్ర బెండ, బీట్‌రూట్, క్యారెట్, ముల్లంగి, నాలుగు రకాల ఆనపకాయ, మూడు రకాల కాకర, ఎనిమిది రకాల వంకాయ, చిక్కుడు విత్తనాలు, ఉల్లిపాయ, చిరు ధాన్యాలు, పప్పు ధాన్యాలు, పాలకూర, చుక్కకూర, మెంతులు, ధనియాలు, మిర్చి, టమాటా, బొప్పాయి, బచ్చలి, నాలుగు రకాల గుమ్మడి విత్తనాలు ప్రదర్శనలో ఉంచారు.

వరికంకులతో గుత్తుల తయారీ శిక్షణలో పాల్గొన్న మహిళలు



వరి కంకులు

పల్లెల్లో రైతుల నుంచి వరి కంకులు కొనుగోలు చేసి వాటితో గుత్తులు తయారు చేయడంపై మహిళలు, విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వరి కంకి గుత్తులను మిద్దె తోటల్లో వేలాడదీయడం వల్ల వీటిని తినడానికి వచ్చే పలు రకాల పక్షులు మిద్దె తోటల్లో పురుగులను తినడం ద్వారా మేలు కలిగి తెగుళ్ల నుంచి రక్షణ, జీవ వైవిధ్యం సాధ్యపడుతుంది.

దేశీయ విత్తన వినియోగంపై అవగాహన



మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది. ప్రస్తుతం మనం తింటున్న హైబ్రిడ్, ఇనార్గానిక్ కూరగాయలతో ఆరోగ్యానికి చేటు. ప్రతి ఒక్కరూ తమ ఇంటికి అవసరమైన కూరగాయలు ఇంటి మేడపైన, ఖాళీ స్థలంలో, మెట్లపైన పెంచుకునేలా మిద్దెతోటల పెంపకంపై మహిళలకు మా సంస్థ ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. గిరిజన, లంక గ్రామాలు, తూర్పు కనుమల్లో పర్యటించి ప్రతి ఏటా దేశీయ విత్తనాలు సేకరించి జూన్‌లో ఉచితంగా పంపిణీ చేస్తున్నాం. ప్రస్తుతం 130 రకాల దేశీయ విత్తనాలు సేకరించాం. 400 రకాలకు పైగా దేశీయ విత్తనాలు సేకరించే పనిలో ఉన్నాం.

– జి.వి.రత్నం, గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపకులు

సంపూర్ణంగా పోషకాలు లభ్యం



ఇప్పటి పిల్లలకు కూరగాయల పేర్లు కూడా సరిగా తెలియని పరిస్థితి. జంక్ ఫుడ్‌కు ఆకర్షితులై ఆరోగ్యవంతమైన ఆహారానికి దూరమవుతున్నారు. పొలం నుంచి కూరగాయలు ఇంటికి ఏ విధంగా వస్తున్నాయో పిల్లలకు నేర్పాలి. పిల్లలను భాగస్వామ్యం చేసేలా ప్రతి ఇంటిలో ఉన్న ఖాళీ స్థలంలో దేశీయ విత్తనాలతో సేంద్రియ విధానంలో కూరగాయలు పండించడం ద్వారా పోషకాలతో కూడిన ఆరోగ్యవంతమైన ఆహారాన్ని పిల్లలకు అందించవచ్చు. దేశీయ కూరగాయలతో శరీరానికి అవసరమైన పోషకాలు అందించడం ద్వారా వ్యాధి నిరోధకత పెంపొందుతుంది. ప్రస్తుతం వినియోగిస్తున్న హైబ్రిడ్ కూరగాయలు కేవలం సైజు, కలర్‌తో ఆకర్షణీయంగా ఉంటాయే తప్ప పోషకాలు ఏమీ ఉండవు.

– సీహెచ్‌వీ అంబిక, గార్డెనింగ్ గ్రూప్ సభ్యులు

ఇంటి పంటతో మేలు



వనమాలి గార్డెనింగ్ గ్రూప్‌లో మూడు వేలకు పైగా సభ్యులు ఉన్నారు. వీరంతా తమ ఇంటి మేడల పైన, మెట్లపైన, ఇంటి ముందు, వెనుక ఉన్న ఖాళీ ప్రదేశాలలో కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. ప్రస్తుత తరం, రానున్న తరం వారు కూడా ఇంటి వద్దనే దేశీయ విత్తనాలతో ఆర్గానిక్ పంటలు పండించేలా మా సంస్థ ద్వారా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలు, దేశీయ విత్తనాలతో కలిగే ప్రయోజనాలు నేటి తరానికి వివరిస్తున్నాం. స్కూల్ పిల్లలను ఆహ్వానించి మేము పెంచుతున్న మిద్దె తోటలను చూపించి బీర, వంగ, చిక్కుడు మొక్కలు ఎలా ఉంటాయో అవగాహన కల్పిస్తున్నాం. ఆర్గానిక్, ఇనార్గానిక్ పంటల మధ్య వ్యత్యాసం, కలిగే లాభనష్టాలు వివరిస్తున్నాం.

– మళ్ల సరిత, వనమాలి గార్డెనింగ్ గ్రూప్ నిర్వాహకురాలు

ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు అవగాహన



వంగ, బెండ, బీరలో ఒక్కో దాంట్లో పదికి పైగా రకాలు ఉన్నాయని చాలా మందికి తెలియదు. జీవీఎంసీ పరిధిలో యూసీడీ విభాగం ద్వారా పొదుపు సంఘాల మహిళలకు మిద్దె తోటల పెంపకం, ఇంటిలోని వ్యర్థాలతో కంపోస్టు తయారీ, దేశీయ విత్తన వినియోగం వంటి విషయాలపై గ్రీన్ క్లైమేట్, వనమాలి గార్డెనింగ్ గ్రూప్‌తో కలిసి అవగాహన కల్పిస్తున్నాం. అలాగే పాఠశాలల్లో విద్యార్థులకు ఇంటి పంటపై అవగాహన కల్పించి విత్తనాలు, నారు అందజేసి భాగస్వామ్యం చేస్తున్నాం. పిల్లల ద్వారా తల్లిదండ్రులను మోటివేట్ చేసేలా కృషి చేస్తున్నాం. ప్రస్తుతం ఆర్గానిక్ ఫుడ్ దొరకడం గగనమైపోయింది. ఆరోగ్యాన్నిచ్చే ఆర్గానిక్ ఫుడ్ భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో పని చేస్తున్నాం.

– ఎస్.దివ్య, జీవీఎంసీ ఎస్ఆర్‌యూ ప్రతినిధి

క్లుప్తంగా

వైభవుడికి లక్ష మల్లెల అర్చన



లక్ష మల్లెల పూజలు అందుకున్న వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువైన వైభవ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామికి లక్ష మల్లెలతో అర్చన చేశారు. ఉదయాస్తమాన సేవల అనంతరం ఉదయం 9 గంటలకు ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై ఆశీనుడైన వైభవ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహానికి ఆలయ అర్చకులు వాసు, శేషస్వాముల ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో లక్ష మల్లెలతో పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గెడ్డ పూడికతీత పనుల పరిశీలన



గెడ్డ పూడికతీత పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ అధికారులు

మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని వంశీనగర్ గెడ్డ పనులను జీవీఎంసీ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు ఆదేశాల మేరకు స్థానిక వార్డు తెలుగుదేశం అధ్యక్షుడు సనపల వరప్రసాద్‌తో కలిసి పారిశుధ్య శాఖ, ఇంజినీరింగ్ శాఖ అధికారులు శుక్రవారం పర్యటించారు. రాజమండ్రి నుంచి ప్రత్యేక బృందాలను రప్పించి మెషీన్లతో గెడ్డలో పేరుకుపోయిన చెత్తను, పూడికను తొలగించి శుభ్రం చేశారు. చెత్తను గెడ్డల్లో వేయవద్దని అధికారులు ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జోన్–5 ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, ఎస్ఎస్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఏఈ సతీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రఘు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ ఈవో బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు విశేష హారతి సమర్పణలో భాగంగా నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



తెన్నేటినగర్‌లో చెట్ల కొమ్మలను తాకుతున్న విద్యుత్ వైర్లు

మురళీనగర్: మురళీనగర్ సమీపంలోని తెన్నేటి నగర్‌లో వీధి లైటు స్తంభం వద్ద విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడి స్తంభంపై ఉన్న 11 కేవీ విద్యుత్ వైర్లు చెట్ల కొమ్మలను తాకుతున్నాయి. గాలికి వైర్లు తాకే సమయంలో నిప్పులు రాలుతున్నాయని స్థానికులు తెలిపారు. దీనివల్ల ఇక్కడి చెట్టును ఎవరైనా తాకితే ప్రాణాపాయం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై విద్యుత్ శాఖ, జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ చెప్పారు. తక్షణం చెట్ల కొమ్మలను తొలగించి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

సీపీఐ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ శ్రేణులు

తాటిచెట్లపాలెం: ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్న సీపీఐ విశాఖ జిల్లా 25వ మహాసభల పోస్టర్‌ను సీతమ్మధార జంక్షన్‌లోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పడాల గోవింద్ మాట్లాడుతూ ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. 10వ తేదీన కంచరపాలెం మెట్టు నుంచి ఓల్డ్ ఐటీఐ జంక్షన్ వరకు మహా ప్రదర్శన, అనంతరం జరిగే మహా సభలో కార్మికులు, కర్షకులు, మహిళలు, యువకులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. మే 11న మాధవధారలో ప్రతినిధుల సభ నిర్వహిస్తామని చెప్పారు. ఈ రెండు రోజుల సభలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్తు ఉద్యమ పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక సీపీఐ నాయకులు మధురెడ్డి, రావి అశోక్, లక్ష్మణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



కార్యక్రమంలో పాల్గొన్న బాలికలతో అంగన్‌వాడీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: బాల్య దశలోనే వివాహాల వలన బాలికల్లో ఆరోగ్యపరమైన, జన్యుపరమైన సమస్యలు ఎదురవుతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.కుమారి తెలిపారు. పిల్లలకు యుక్త వయసు వచ్చాక మాత్రమే పెళ్లి చేయాలని సూచించారు.

కిశోరి వికాసం వేసవి శిక్షణలో భాగంగా రేసపువానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'బాల్యవివాహాల వలన ఎదురయ్యే సమస్యల' గురించి వివరించారు. సచివాలయ మహిళా పోలీసు విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్ట వ్యతిరేకమని తెలిపారు. బాల్య వివాహ నిరోధక చట్టం గురించి వివరించారు. ఐరన్ సమృద్ధిగా ఉండడానికి తీసుకోవలసిన ఆహారపదార్థాల ఏఎన్ఎం కృష్ణవేణి వివరించారు. అనంతరం రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశావర్కర్ భవాని, అంగన్‌వాడీ టీచర్లు గౌరి, రాజ్యలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

డ్రైడే పాటిస్తే మేలు



అక్కయ్యపాలెంలో అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ మలేరియా సిబ్బంది

సీతంపేట: వారం రోజులు పైబడి మంచినీరు, వర్షపు నీరు నిల్వ ఉంటే మలేరియా, డెంగ్యూ జ్వరాలను కలగజేసే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని జీవీఎంసీ మలేరియా సూపర్‌వైజర్ బి.శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెంలో ఫ్రైడే డ్రైడే ప్రాముఖ్యత గురించి శుక్రవారం స్థానికులకు అవగాహన కల్పించారు. వార్డులో డ్రైడే అమలు తీరును పరిశీలించారు. సిబ్బందితో ఇంటింటికి వెళ్లి నీటి నిల్వలను పరిశీలించి, దోమ లార్వాలు పెరుగుతున్న నీటిని పారబోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. వారానికి ఒక రోజు (ప్రతి శుక్రవారం) డ్రైడే పాటించి, గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులలో నీటిని తొలగించి, ఆరబెట్టి మరలా నీటిని పట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ హెల్త్ అసిస్టెంట్ కె.ఎస్.ఎస్.నారాయణ, జీవీఎంసీ యాంటీ లార్వా సిబ్బంది పాల్గొన్నారు.

ఫీజులు నియంత్రించాలని డీఈవోకు వినతి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విశాఖ విద్య: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు ఇష్టానుసారంగా పెంచుతున్న ఫీజులను నియంత్రించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడంతోపాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. వేసవి సెలవుల్లో కూడా బ్రిడ్జ్ కోర్సు పేరుతో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో స్కూళ్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్, ఉపాధ్యక్షుడు కె.కిరణ్, నాయకుడు శంకర్ పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: పెరుగుతున్న ఎండలను దృష్టి లో పెట్టుకుని కేజీహెచ్‌కు వస్తున్న రోగుల సహాయకుల దాహార్తి తీర్చడం కోసం కేజీహెచ్ ఆవరణలో ఇస్కాన్ సంస్థ సహకారంతో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఇస్కాన్ సేవల ను కొనియాడారు. ఇస్కాన్ సభ్యులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిత్ర కవిత్వంపై అవగాహన

మురళీనగర్: స్థానిక వర్మ కాంప్లెక్సు సమీపంలోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో చిత్ర కవిత్వం, తెలుగు భాషా విశిష్టతపై అవగాహన సదస్సు శనివారం నిర్వహిస్తామని నిర్వాహకురాలు బీకే అపరంజి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు తెలుగు భాషావేత్త ఓరుగంటి రాజరాజేశ్వరీ ప్రసాద్ వివరిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ పరిసరాలకు చెందిన విద్యార్థులు, తెలుగు భాషాభిమానులు పాల్గొనాలని ఆమె కోరారు.

బాలుర పరిశీలన గృహానికి యూనిఫారాల వితరణ



మాట్లాడుతున్న పినాకిల్ ఆస్పత్రి అధికారులు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు దీన్‌దయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహానికి శుక్రవారం పినాకిల్ హాస్పిటల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యూనిఫారాలు వితరణ చేసింది. సీఎస్సార్ నిధులు వినియోగించి 200 జతల యూనిఫారాలను గృహం పర్యవేక్షణాధికారి కె.వీరయ్య ఆధ్వర్యంలో బాలురకు ఆస్పత్రి కార్పొరేట్ వ్యవహారాల అండ్ ఆడిట్ మేనేజర్ టి.మణిరాజు, కంపెనీ సెక్రటరీ సోనికుమారి, సిబ్బంది పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ పినాకిల్ ఆస్పత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం గృహంలో 67 మంది బాలురు ఉన్నారని, వారందరికీ యూనిఫారాలు అందజేసినట్లు చెప్పారు. బాలుర గృహం సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

మద్దిలపాలెం: కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేఆర్ఎం కాలనీ–1 అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అర్బన్ సీడీపీవో ఎం.వి.రమణకుమారి ఆదేశాల మేరకు ఏసీడీపీవో శ్రీలత పర్యవేక్షణలో సూపర్‌వైజర్ సెల్వియా ఆధ్వర్యంలో కిశోర బాలికలకు వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామని అంగన్‌వాడీ కేంద్ర కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి తెలిపారు. 6వ రోజు బాలికల ఆరోగ్యంపై, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించామన్నారు. బాలికల్లో నెలకొన్న సందేహాలను తెలుసుకుని, వాటిని నివృత్తి చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్, స్థానిక కిశోర బాలికలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఫైరింగ్‌లో ప్రథమ స్థానం

సైనిక్ స్కూల్ ట్రైనింగ్ క్యాంప్‌లో ఎన్‌సీసీ క్యాడెట్ల ప్రతిభ



ఫైరింగ్‌లో ప్రథమ స్థానం పొందిన ఎన్‌సీసీ క్యాడెట్లు హర్ష, రమేష్



కోరుకొండ సైనిక్ స్కూల్లో మ్యూజియంను సందర్శిస్తున్న అక్కయ్యపాలెం ఎన్‌సీసీ క్యాడెట్లు

సీతంపేట: విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్‌లో జరుగుతున్న కంబైండ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లు అద్భుత ప్రతిభ చూపారు. వెలగల హర్షవర్ధన్, మురుకుర్తి రమేష్ శుక్రవారం జరిగిన ఫైరింగ్ కాంపిటీషన్‌లో ఐదుకు ఐదు పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరిని పాఠశాల ఎన్‌సీసీ ఆఫీసర్ ఎం.ఎస్.వి.విశ్వనాథం, మేజర్ బ్రహ్మానందరెడ్డి, సుబేదార్ జయప్రకాష్, నేతాజీ, శ్యామలరావు అభినందించారు. అనంతరం సైనిక్ స్కూల్‌లోని మ్యూజియంలో వివిధ మిస్సైల్స్, క్షిపణులు, ట్యాంకులు, ఇతర యుద్ధ పరికరాలను సందర్శించి, యుద్ధ వీరులు, సేవామెడల్స్ విశిష్టత తెలుసుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని విశాఖ రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుండి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. శుక్రవారం విశాఖ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్. రామారావు, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ ఎస్. చిట్టిబాబులు సిబ్బందితో కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలను ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఒడిషా రాష్ట్రం, గంజాం జిల్లాకు చెందిన బలరాం సాహూ విశాఖ మీదుగా సూరత్, గుజరాత్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేయడాన్ని గుర్తించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది నిందితుడిని అదుపులోకి తీసుకుని ఎస్ఐ రామారావుకు అప్పగించారు. అతని వద్ద నుండి రూ. 50 వేల విలువైన 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, అతన్ని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు.

మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విశాఖ విద్య: పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూజీ, పీజీ పరీక్షల్లో కొంతమంది విద్యార్థులు అనైతికమైన చర్యలకు పాల్పడటం, మాల్ ప్రాక్టీస్ చేసినట్లు వర్సిటీ అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏయూ పరీక్షలకు సంబంధించిన నియమావళికి అనుగుణంగా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు.

ఏయూ పరిధిలో కొద్ది రోజులుగా జరుగుతున్న పరీక్షలను ప్రత్యేకంగా నియమించిన తనిఖీ బృందాలు, ప్రత్యేక పరిశీలకులు నిరంతరం పర్యవేక్షణ, పరిశీలన చేసి పరీక్షా కేంద్రాల్లో కొంతమంది విద్యార్థులు చీటీలు పెట్టి రాయడం, పుస్తకాల్లో చూసి రాయడం, మొబైల్ ఫోన్‌లో చూసి రాయడం వంటి చర్యలకు పాల్పడడాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగానికి వీరిపై నివేదికను పరీక్షల తనిఖీ అధికారులు పంపారు. మాల్ ప్రాక్టీస్‌కి పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన విద్యార్థుల పరీక్షను రద్దు చేయడం, నిర్దిష్ట కాలం పాటు వారు పరీక్ష రాయకుండా నిషేధించడం, ఇటువంటి చర్యలను ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యం, సిబ్బంది పైన క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.